1987 దీపావళి కథల పోటీలో రు.700/-లు బహుమతి పొందిన కథ

# క్షీరధార

## ఆ చిన్ని ఊరవతల, మిన్నేటికివతల....

వేద మంత్రాల ఘోషనుపోలిన అంబారవాల మ్రోతతో, దూది గుట్టలవంటి జలదాల జట్టుల నందుకోను పైకెగిసిపోతున్న హోమ ధూమంలా ఆ గోధూళి సమూహం సాగిపోతూ, వో చిన్ని పాయగా చీలి క్రమేపీ సన్నబడి ఆ యింటిముంగిట ఆగిపోయింది.

"అంబా" ప్రీతిగా గోమాత పిలుపు!

ప్రతిగా లేగదూడ అరుపు!

"రామాలాలీ.... మేఘశ్యామా లాలీ" వో మాతృ గొంతుక! "ఊంగా... ఊంగా...." వో పసి భాష లోని పాప కేరింత!

అన్నీ కలగలిసి యేకమ్మైన ప్రతినాటిలాగే ఆ నాటి సంధ్యా రాగాన్నికూడా అందంగా ప్రతిబింబిస్తున్నాయి.

అరుబయట నులకమంచంపై పొత్తిళ్ళు సరిజేసి చంకలో ని పసివాణ్ణి పడుకోబెట్టింది అనసూయ.

బుట్టలో తడిపిన కాసింత దాణాతెచ్చి ఆవు ముందుంచింది. సగానికోసి ఎండబెట్టిన

బీరకాయ ముక్కతో దాని వొళ్ళంతా రుద్దసాగింది

కృతజ్ఞతతో నో, మూగప్రేమతో నో అపుడపుడూ



మోర పైకెత్తి ఆమెకేసి చూసే ఆవు గంగడోలు ఆప్యాయంగా తడిమింది.

దూడ తెంచుకోను సిద్ధపడుతూ పురకలేస్తున్న లేగదూడ పలుపు విప్పిందామె.

పొదుగు కుమ్ముతూ పాలు తాగుతున్న లేగను చూస్తూ, మంచంపై కేరింతలుకొడుతున్న కొడుకును చూస్తూ గడపలో అలా కూర్చుండిపోయిన అనసూయ బ్రతుకులోని బాధలన్నీ ఆ క్షణం మర్చిపోయేలా హాయిగా ఆనందంగా నవ్వింది.

ఇవాళ పాలన్నీ దూడకే వదిలేస్తున్నావేంటి అనసూయా?" భర్త రామచంద్రం పిలుపుతో వులిక్కిపడింది.

రానని మొరాయిస్తున్న దూడను లాక్కెళ్ళి కట్టేసి పొదుగుకడిగి పాలు పితకసాగింది.

మనిషికి అవసరమైన, మనసుకేదో ఆనందమైన, వో వింత శబ్దంతో కూడిన సుమధుర సంగీతంతో కురుస్తున్న ఆ పాలధారలు అన్నృతంకాని అమృత ధారలైన జీవధారలై బ్రతుకుదారులైనట్టు తోచింది అనసూయకు.

పాలు తీయటం పూర్తిచేసి. ప్రేమగా ఆవు నుదుట తనుంచిన పొద్దుటి తాలూకూ కుంకుమ ఛాయలపై మెల్లగా మూర్కొంది.

తల్లీ..... నీ కిద్దరు బిడ్డలు! కన్నానేకాని మూడు నెల్లకే బిడ్డకు పాలు కరువుచేసిన బలహీనపు తల్లిని! కడుపారా కూడైనా తినలేని బడుగు తల్లిగా గుండెలనిండా మురిపాలు తప్ప పసివాడికి పాలే కొరవడ్డ అమ్మను! వేసే గరిక పరకలతోనే కడుపేకాదు పొదుగుకూడా నింపుకుని నీ బిడ్డకే కాదు నా బిడ్డకూ ఆధారమైన నీ ఋణం ఎలా తీర్చుకోను?"

పాత్రలో పైకి తేలిన పాల నురగలాంటి భావమేదో గుండెలనిండా చోటుచేసుకోగా యింట్లోకి నడిచిందామె.

"అనసూయా."

అంతలోనే భర్త పిలుపుతో బయటికొచ్చింది.

తాము అప్పుచేసిన పక్కవూరి షావుకారు తమ్ముడు కాంతయ్య కూర్చుని వున్నాడు మంచంమీద!

"బాకీ తాలూకూ డబ్బు వసూలుకై వచ్చుంటాడు." పిల్లాణ్ణి భుజంపై వేసుకున్న ఆమె మనసులో భయం చోటుచేసుకుంది.

"కాంతయ్యకు వో కప్పు కాఫీపెట్టు."

"కాఫీ వొద్దుగాని బాకీ సంగతి తేల్చుముందు! యేదో టి సెటిల్‌కాందే తిరిగి రావొద్దన్నాడన్నయ్య."

ఖచ్చితంగా అన్నాడు కాంతయ్య.

"ఏం చెయ్యను కాంతయ్యా! నాకుమాత్రం అప్పు పెంచుకోటం యిష్టమా? యెప్పటికప్పుడు తీరుద్దాం అనుకుంటూనే యేవో టిబ్బందులు! తిండికీ బట్టకే బతుకు కరువైపోతోంది."

"అంటే నీ వుద్దేశం? కాళ్ళావేళ్ళా బతిమాలి అప్పు తీసుకున్న నాటి పరిస్థితి మర్చిపోయావా?"

"అంతమాటనకు బాబూ.... తల తాకట్టు పెట్టయినా మీ బాకీ అణా పైసల్తోసహ తీరుస్తాను! మరొక్క నెల రోజులు...."

"ఆఁ యీ మాట యేయేటికాయేటిగా వింటూనే వున్నాం! ఆగిన అలాంటి నెలలెన్నో.... కానీ కలలో కూడా మా బాకీ తీరలేదు. అయినా అప్పిచ్చిన అయిదేళ్ళపైగా యెవరూరుకుంటారు? అన్నయ్యసలే ఖచ్చితమైన మనిషి! ఆయనదాకా రానివ్వొద్దు! వెంటనే.... అంటే వో వారంలోగా అప్పుతీర్చేస్తే సరి... లేదా, తాడోపేడో తేల్చుకోవల్సిందే నంటున్నాడు! ఆపై మీ యిష్టం! అయినా....."

అంటూ అరక్షణంలో ఆగిపోయి అంతలోనే మళ్ళీ అన్నాడు "తీర్చే స్తోమతే లేనపుడు యే ధైర్యంతో అప్పుచేశావయ్యా అదీ యింత రేటు వడ్డీ మీద?"

చివుక్కుమంది రామచంద్రం మనసు! బదులేమీ యివ్వలేకపోయాడు.

"ఇదిగో రామచంద్రం, యీరోజు సోమవారం. వచ్చే సోమవారంలోగా డబ్బు చెల్లించకపోయావో...... ఆపై మీ యింటికొచ్చేది నేనుకాదు. సరాసరి మా అన్నయ్యే వచ్చి తేల్చుకుంటాడసలు సంగతి! ఆఁ...."

చరచరా వెళ్ళిపోయాడు కాంతయ్య,

చరాచర జగత్తు తల్లక్రిందులైనట్టనిపించింది రామచంద్రానికి. "తీర్చే స్తోమత లేనపు డే ధైర్యంతో అప్పుచేశావ్?" కాంతయ్య మాటే మళ్ళీ మళ్ళీ మనసులో.... బాధ, అవమానం వొకదానితో నొకటి జతకట్టాయి. "అవును.... యే ధైర్యంతో ఆ అప్పు చేశాడు తను?" బరువుగా నిశ్వసించాడు.

"ఏటికేటికీ కరువూ కాటకాల ధాటికాగలేక, వున్న రెండెకరాల పొలం యెన్నడో చెల్లెలి పెళ్ళికోసం అమ్ముడుపోయింది. యింక పనేముందని, బ్రతుకు తెరువేముందని మిగిలిన ఆ గొడ్డూగోదా బాధగా, తిండిగింజల గాథగా మారిపోయింది. మరికొద్ది కాలంలోనే, తానూ వో వ్యవసాయి కూలీగా మారనున్న తరుణంలో, తల్లిప్రాణం కాస్త తల్లక్రిందులవటంతో, తట్టుకోలేకపోయాడు తను! నవమాసాలు మోసి కని పెంచిన తల్లి మంచంపైబడి చావుబతుకుల్లోవుంటే, చేతిలో చిల్లిగవ్వలేని స్థితిలో, యే వొక్కరి సాయం దొరకని పరిస్థితిలో.... ఆమె వైద్యంకోసం....



కొడుకునుండి ఋణం తీర్చుకుంటూ తన పాత్ర విరమించుకుంటూ ఆ తల్లి యీలోకం నుండే సెలవుతీసుకుంటుంటే ఆ మాతృమూర్తి కోసం ఆఖరుసారిగా తను పెట్టాల్సిన కాటి ఖర్చులకోసం కర్మకాండలకోసం

అప్పుడు ఆప్పుడు చేశాడీ అప్పు

ఏ ధైర్యంతో చేశాడు మరి?

కొడుకుగా తను తను బ్రతికేవున్నాడన్న ధైర్యంతో తనువిచ్చిన తల్లికోసం తనువు చాలించిన తల్లికోసం చేశాడు' అంతే!

బారమ్మైన రామచంద్రం గుండెలనుండి సరాసరి రెండు కన్నీటి బిందువులు దారకట్టాయి

బాధపడకండి' ఆ బగవంతుడున్నాడు'

బాధ తనలోనే బద్రపరుస్తూ లేని ధైర్యం కనబరుస్తూ అసహాయుడైన బర్త కన్నీరు తుడిచింది అనసూయ

* * * * *

వారం రోజులుగా బంధుమిత్రులూ తెల్సినవాళ్ళ అన్ని వూళ్ళూ తిరిగి నిరాశతో తిరిగివచ్చాడు. రామచంద్రం

వారం దాటి ఆ మర్నాడు

ఆ యింటిముంగిట వో కొత్త అడుగులచప్పుడు'

రామచంద్రం'

ఉలిక్కిపడ్డాడు రామచంద్రం

వో మనిషితో పాటు తనింటికే వచ్చిన అప్పిచ్చిన పెద్దమనిషి నారాయణను చూసి ,

రండిబాబుగారూ రండి మంచం వాల్చాడు

అప్పుసంగతి తేల్చమన్నాడాయన

కళ్ళు తేలవేశాడు రామచంద్రం

ఈనాడు యిటో అటో తేలందే నే కదిలేదిలేదు

గట్టిగా అన్నాడు

పెదవులు తడారిపోయాయి గొంతులోనే మాట లాగిపోయాయి రామచంద్రానికి

అయిదేళ్ళక్రింత చేసిన అయిదొందల అప్పు వడ్డీతో సహా వెయ్యిదాకా అయిందాకా పెంచుకున్నావ్' యిప్పటికీ తీర్చలేకుంటే యింక ఆపై నీవల్ల యేమవుతుంది? నాకేం చెల్లవుతుంది? వల్లకాదు'

ఎన్ని తంటాలుపడ్డా యీ వారంలోగా నావల్ల కాలేదుబాబూ'

నిరసనగా చూశాడాయన.

ఇహ అప్పుచెల్లించేలా లేదు నీ తీరు. నాకు తెల్సు! అందుకే అప్పుకిందికి యిదుగో... యీ ఆవుని తోలుకుపోతున్నాను అన్నాడతను

బాబుగారూ గాబరాపడ్డాడు రామచంద్రం

ఆ ఆవు పాలదారలేబాబూ మా పిల్లాడి కిప్పు డాదారం

అర్థిస్తున్నాడు రామచంద్రం' ససేమిరా అంటున్నాడు ఆ నారాయణ


ఇంట్లోంచి అంతా వింటున్న అనసూయ నవనాడుల్లూ కుంగిపోయాయి

మా లక్ష్మిలాంటి ఆవునా అప్పుకింది కప్పజెప్పేది? తన బిడ్డ కడుపు నింపుతున్న ఆ తల్లి ఋణమిలాగా తాము తీర్చుకునేది? ఏనాటి అనుబంధం దానితో తనకు?

ఏ కట్న కాన్కలివ్వలేని నిరుపేద తండ్రి తన్నత్తింటి కంపుతూ చిన్ననాటినుండీ తల్లిలేని పిల్లదూడగా తన ఆలనాపాలనాలో పెరిగిన యీ గో లక్ష్మినే పసుపుకుంకాలక్రింద మళ్ళూ మాన్యాలుగా బావించమని దీవించి తనతో పంపాడు ఎన్నిబ్బందులున్నా యీ లక్ష్మిని మాత్రం తామలక్ష్యంచేయలేదు బిడ్డ తల్లయిన ఆ గో మాత పాలే తన బిడ్డ కాహారం' ఆ లక్ష్మి తమ ఆరోప్రాణం' పొద్దునలేచి ఆ గో ముఖం చూడందే తనేపనీ చెయ్యందే

బరించలేకపోతోందామె'

చెవులూ చేతులూ కాళ్ళూ ముక్కూ తడుము కుంది బాదగా'




ఊహూ! ఆ తల్లిని నిల్పుకోను వొక్క నగైనా యెక్కడుంది! ఆ గో లక్ష్మిని మించి మరే సంపదాలేని పేదరాలిగా తనకు?

గోడకి చేరగిలబడి మౌనంగా రోదించసాగింది

అనసూయా

అనునయంగా ఆమె భుజంపై చేయి వేశాడు తోపలికొచ్చిన రామచంద్రం

ఏమండీ మన లక్ష్మి మన బాబుకి మరో తల్లి బాల్యంనుండీ నా నేస్తం! యెలాగండీ దాన్ని పంపటం?

బావురుమందామె

తప్పదు అనసూయా పరువుకన్నా పాశం ముఖ్యంకాదు!

అత్తింట అడుగుపెట్టే నాతో పాటేగా అదిక్కడ కాలుపెట్టింది? ఆ నిస్థానమిక్కడేకాదా? ఆ జన్మాంతం దాని అనుబంధం మనతో నేకాదా?

మళ్ళీ రుద్ధమైంది అనసూయ కంఠం ఆగని దుఃఖంతో

ఆర్తిగా ఆమె తల నిమిరాడు రామచంద్రం

సర్దుకో అనసూయా కళ్ళు తుడుచుకో ఆఖరుగా ఆ గో మాతనుకూడా నిల్పుకోలేని పసిబిడ్డ ఆకలికూడా తీర్చుకోలేని దౌర్భాగ్యుల మౌతున్నాం యేంచేస్తాం? చివరిస్సారిగా మన లక్ష్మిని కళ్లారా చూసుకుందువుగాని రా అవతల ఆయన వేచివున్నాడు

దగ్గుత్తికతో అంటూ అడుగు బయటకువేశాడు రామచంద్రం

ఏమిటయ్యా యింకా ఆలస్యం?

విసుక్కున్నాడు నారాయణ

ఆయన కూడా వచ్చిన మనిషి ఆవు పలుపు విప్పి చేతబట్టుకున్నాడు

అంతలోనే యింట్లోంచి పరుగున వచ్చింది అనసూయ

తడిసిన కుంకుమపూవుల్లాంటి కళ్ళు తుడుచు కుంటూ చేతిలోని కుంకుమభరిణతో ఆవు ముందునిల్చింది

చివరిసారిగా దాని వొళ్ళంతా నిమిరి ఆవు నుదుట బొట్టుపెట్టి దండంపెట్టింది

అంతా చూస్తున్న నారాయణ హటాత్తుగా వొక్కంగలో ఆమెను సమీపించాడు

మళ్ళీమళ్ళీ ఆమె ముఖంలోకి చూశాడు

ను నువ్వు అనాటి ఆమెవికదూ ?

అకస్మాత్తుగా వో మూణ్ణెల్లక్రితం నాటి సంఘటన జ్ఞాపకమొచ్చిందాయనకు

* * * * *

పరి పల్లెకాని పట్నంకాని ఆ వూరి నుండి బయల్దేరిన వో ప్రైవేటు బస్సు కదిలిన కాసేపటికి వో పసిబిడ్డ మేల్కొన్నాడు చిన్నపాటి యేడ్పురాగంతో

అది గమనించిన ఆమె బుట్టలోని పాలసీసా నందుకుని దాన్ని చుట్టిన ప్లాస్టిక్ కవర్ విప్పబోయింది

వొక్కసారిగా వూపేసిన బస్సు కుదుపుతో వొళ్లోని పిల్లాడు కిందపడకుండా పట్టుకోబోయే తొందర్లో

చేతిలోని పాలసస క్రిందపడి భళ్ళుమని బద్దలై పోయిందామెక్కళ్ళ నీళ్ళు మళ్ళించగా!

ఎలా? యిప్పుడెలా? బాబులేచాడు! ఆకలి వేస్తుందొచ్చు! అదేపనిగా నిద్రపోతూ పాలు తాగలేదు పొద్దుటకూడా! నిద్దట్లో అలాగే తీసుకొచ్చేశాను బాగా యేడుస్తున్నాడు

యేడ్పుమొహంతో అందామె

పిల్లాడి యేడ్పుకంటే ఆకలికంటే యెక్కువా? సీసాపోతేపోయింది నిండా కొంగుకప్పుకొని పాలుపట్టకూడదూ?

ఎవరో పెద్దావిడ అన్నదానికి యెఱ్ఱబడ్డదామె మొహం

ఈ అమ్మాయి నా చెల్లెలు! యింకాపెళ్ళే కాలదు! యీ పిల్లాడు నా కొడుకు పెద్దమ్మా! వూళ్ళోని అస్పత్రిలో పోలియో మందయి పోవటంతో, పిల్లాడికి గడువు దాటి పోతుందని టౌన్ కెళ్ళి వేయించుకు రావొచ్చని నా చెల్లి బయల్దేరింది వో పనిబడి వెళ్తున్న నా వెంట! జ్వరంగా వుండి నా భార్య రాలేకపోవటంతో యిలా జరిగింది!

ఊరుకో నాన్నా వూరుకో అంటూ పిల్లాణ్ణి పక్క సముదాయిస్తూనే సమాదానం చెప్పాడామె పక్కన కూర్చున్నాయన

అంతకంతకూ అధికమౌతున్న ఆ పసివాడి రోదనంతోనే వో స్టేజీ దాటింది బస్సు

బస్సు హోరునూ జనం మాటామంతీ తీరునూ మించి విన్పిస్తుందా పిల్లాడి ఆకలి పోరే!

ఎందుకొచ్చిన బాదరా బగవంతుడా అంటూ వేదన పడిపోతుందా అమ్మాయి

ఒరే బాబూ కాస్త ఆగరా పిల్లాణ్ణెత్తుకుంటూ చిచ్చికొడుతూ, ఎలాగో వోపిక పట్టాలి! వచ్చినంత సేపట్లో టౌన్లో వుంటాం! అటు పిల్లాణ్ణీ, యిటు చెల్లినీ యేక కాలంలో సమాదాన పరుస్తున్నాడా తండ్రి

క్షణ క్షణం వేగం దూరం కొల్చుకుంటున్న వాళ్ళ ఆశల్ని కూల్చుతున్నట్టుగా హటాత్తుగా బస్సాగిపోయింది

ఆ నిశ్శబ్దంలో యిప్పుడా పసివాడి రోదనం రోదసి నంటుతోంది

ఏవేవో సామాన్లతో కాసేపు రిపేరు చేసి ప్రిపేరు కాలేదని యీ సర్వీసు నడవదని మరోటి వచ్చేదాకా ఆగాలని చెప్పటంతో కుప్పకూలినంత పనయింది ముఖ్యంగా ఆ అన్నా చెల్లెళ్ళకి! -

పిల్లాడి యేడుపాగటం లేదు!

ఆగటం ఆగటం వూరు దాటి నట్టనడి అడవిలోనే ఆగాలా యీ పాడు బస్సు. కన్నీళ్ళాగ లేదా చెల్లికి

కిందికి దిగి చెట్లూ పిట్టా చూపారు! భుజమ్మీదేసుకు వూపారు! మంచినీళ్ళు తాపారు! ఊహూ!! లాభం లేకపోయింది

పెదవులు తడుపుకుంటూ దేని కోసమో తడుముకుంటూ గుక్కపట్టి యేడుస్తున్నాడు పసివాడు

ఆ తండ్రి జేబు నిండా నోట్లున్నాయి!

పిల్లాడి కడుపు నిండా ఆకలి వుంది!

ఆ స్థితిలో ఆయన కన్పించింది ఆ నోట్లన్నీ పోయినాసరే పిల్లాడి ఆకలీ యేడుపూ పోతే చాలని!

దిక్కు తోచక నాల్గు దిక్కుల కేసే చూస్తున్నారా యిద్దరూ బిక్క మొహాలోత్

ఆకలి తీరనంతవరకూ వంట్లో వోపికున్నంత వరకూ యేడుస్తాడు! అలా యేడ్చి యేడ్చి ఆపై యేమౌతాడు పిల్లాడు?" దిగులుగా వుంది వాళ్ళకి

రొక్క లిగరేస్తూ అయాసపడుత్, రాత్రాను నీరసంలోకి దిగుతూ కూడా అలా యేడుస్తూనే వున్నాడా చంటాడు

ఏం చెయ్యాలి? బాదగా భయంగా యెన్నడూ తలొంచని దీనావస్థలోకి దిగిపోతూ నీళ్ళు నిండిన కళ్ళని కూడా దాచుకోలేక నిస్సహాయంగా చూస్తున్నాడా తండ్రి అంతలోనే

ఏమండీ అన్న పిలుపు విన్పించి తిరిగి చూశాడు అందాకా బస్సులో తమ ముందు సీట్లో వో చంటి పిల్లాడితో కూర్చున్న అడమనిషి ఆమె

వో చెట్టు కింద పర్చి వున్న టవల్పై కాళ్ళూ చేతులాడిస్తూ ఆడుకుంటున్నామె పిల్లాడు

మీ బాబు నిటివ్వండి" అడిగింది.

ఎంత వేసారి వున్నాడో, మరెంత టెన్షన్ భరించి వున్నాడో గాని, రక్కున ఆమె చేతికందించాడు బాబుని

ఆప్యాయంగా ఆ పిల్లాణ్ణందుకున్న ఆమె కదిలిపోయిందట నుండి.

గట్టిగా. మెల్లగా... చిన్న మూల్గుగా బాబు యేడ్పు వో చెట్టు చాటుగా ఆగిపోయినట్టన్పించింది

అలవోకగా అటు చూశాడాయన!

ఒళ్ళో వుంచుకున్న బిడ్డ చుట్టూ పైట కొంగు నిండుగా కప్పుకొని కూర్చుని వున్న ఆమె కన్పించిం దతడికి లీలగా! జరుగుతున్నదర్థం చేసుకున్నాడు

ఆ క్షణంలో ఆయన కన్పించింది అందని శిఖరా లందుకున్నట్టుగా!

మరి కాసేపటికి తిరిగొచ్చిన ఆమె చేతుల్లో ఆకలి ఆరాటం అలసట తీరిన బాబు ఆదమరచి హాయిగా నిద్రిస్తూ కన్పించాడు

ఎంతో రిలీఫ్‌గా పీలౌతూ ఆమె వేపు చూశాడా తండ్రి కట్టూ బొట్టూ తీరు చూస్తే కడు పేదరాల్లా వుంది

బాబునిచ్చి వెనుదిరిగి వెళుతున్న ఆమె నుద్దేశించి అన్నాడాయన

నువ్వెవరో గాని వూహించని వుపకారం చేసిన నీ మేలు మర్చిపోలేను" ఇదిగో చూడమ్మా ఫరవా లేదు యీ డబ్బు నీ దగ్గరుంచు

ఆ డబ్బెంతుందో ఆమె చూడలేదు

నేలచూపుల్తోనే యిలా అంది చిన్నగా

చిన్నికృష్ణుడికి వెన్నపెట్టిన ఒక్కనాటి కాదు కాదు వొక్కపూట యశోదమ్మతల్లి మనసుకైనా వెలకట్టగలరా బాబుగారూ

నిరుత్తరుడయ్యాడతను!

ఆమే అనసూయ! ఆయనే నారాయణ!

* * * * *

అమ్మా! నువ్వా అనసూయా

సన్నగా వణికింది నారాయణ కంఠం

నీటిలో పడవుండొచ్చుగాని పడవలో నీరుండరా దన్నట్టు మనిషికి డబ్బుండొచ్చుగాని డబ్బుకోసం మనిషుండరాదని ఆనాడే నీ మాటతో గ్రహించాల్సింది! ఆలస్యమైందమ్మా! నన్ను మన్నించు!

అంటూ వెనుదిరిగి వెళ్ళిపోయాడు నారాయణ ఆ యింటిముంగిటే నిలిచి ఆనందంగా తలూపుతున్న గోమాత పాదధూళి క్రిందపడి నలిగిపోయాయి నారాయణ చించిపారేసిన తీరని అప్పు తాలూకూ కాగితం ముక్కలన్నీ! ◘

